రంజాన్ వేళలు

	ఇఫ్తార్(శనివారం)	సెహరీ(ఆదివారం)
కర్నూలు	6:34 (సాయంత్రం)	4:57 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:31 (సాయంత్రం)	5:10 (ఉదయం)
ఆదోని	6:36 (సాయంత్రం)	4:58 (ఉదయం)



ఎంపీటీసీకి ఎంపీ సీటు..!

- కర్నూలు లోక్‌సభ టీడీపీ అభ్యర్థిగా పంచలింగాల నాగరాజు
- గత స్థానిక సంస్థల్లో రాజకీయ అరంగ్రేటం
- తృటిలో చేజారిన ఎంపీపీ పదవి

బీసీలకే టికెట్... మాట నిలబెట్టుకున్న చంద్రబాబు



కర్నూలు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల కురుక్షేత్రంలో గెలుపే లక్ష్యంగా టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు గెలుపు గుర్రాలను ఎంపిక చేశారు. ఇప్పటికే జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎమ్మెల్యే అభ్యర్థులను రెండు విడతల్లో ప్రకటించారు. శుక్రవారం రాష్ట్రంలో 13 పార్లమెంట్ స్థానాలకు ఎంపీ అభ్యర్థులను టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించారు. రాజకీయ, సామాజిక సమీకరణలు, సర్వే ఆధారంగా కర్నూలు పార్లమెంట్ స్థానం టీడీపీ అభ్యర్థిగా కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామానికి చెందిన టీడీపీ బీసీ సాధికారిత రాష్ట్ర సమితి సభ్యుడు, ఎంపీటీసీ సభ్యుడు బస్తిపాడు నాగరాజు అలియాస్ పంచలింగాల నాగరాజు పేరును అధికారికంగా ప్రకటించారు. రెండున్నర ఏళ్ల క్రితమే ఈ ఎన్నికల్లో కర్నూలు ఎంపీ టికెట్ బీసీ సామాజికవర్గంలో కురవ సామాజిక వర్గానికి ఇస్తున్నట్లు అధిష్టానం సంకేతాలు ఇచ్చింది. ఆ ప్రకారమే నాగరాజును ఎంపిక చేస్తూ చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు.

జిల్లాలోని బీసీలలో రాజకీయంగా వెనుకబడిన కురవ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి పంచలింగాల నాగరాజు. ఎంఎస్సీ బీఈడీ చేసిన విద్యావంతుడు. ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలికల కళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా మూడేళ్లు పని చేశారు. ఆ ఉద్యోగానికి రాజీనామా టీజీవీ గ్రూప్స్‌కు చెందిన రాయలసీమ అల్కాలిస్ సంస్థలో కూడా ఏడాది పాటు పని చేశారు. ఆ ఉద్యోగానికి కూడా రాజీనామా చేసిన ఆయన రియల్ ఎస్టేట్ రంగంలో అడుగులు వేశారు. టీడీపీలో చేసి సామాన్య కార్యకర్తగా సేవల అందించారు. ఆ తర్వాత టీడీపీ బీసీ సాధికారిత రాష్ట్ర సమితి సభ్యుడిగా పార్టీ ఎంపిక చేసింది. 2020లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కర్నూలు మండల పరిషత్తు అధ్యక్ష పదవి కోసం పోటీ పడ్డారు. పంచలింగాల-1 ఎంపీటీసీగా పోటీ చేసి విజయం సాధించారు. నాటి ఎన్నికల్లో అధికార వైసీపీ నాయకులు, పోలీసుల బెదిరింపులు, ఒత్తిళ్లు తట్టుకొని తనతోపాటు 11 మంది ఎంపీటీసీ సభ్యుల్ని గెలిపించుకున్నారు. మండలాధ్యక్షపీఠం దక్కాలంటే 12 ఎంపీటీసీ సభ్యుల మద్దతు ఉండాలి. కానీ స్వతంత్ర ఎంపీటీసీ సభ్యుడు వైసీపీకి మద్దతు ఇవ్వడంతో ఎంపీపీ పదవి తృటిలో చేజారింది.





కర్నూలులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాగరాజు, టీడీపీ నాయకులు

టీడీపీ సీనియర్ నేతలను కలిసిన నాగరాజు

టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు తనకు టికెట్ కేటాయించగానే ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, కోడుమూరు టీడీపీ మాజీ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్, కోడుమూరు (ఎస్సీ) టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిలను కలసి తనను ఆశీర్వదించి మద్దతు ఇవ్వాలని కర్నూలు ఎంపీ టీడీపీ అభ్యర్థి నాగరాజు కోరారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నాగరాజు బయోడేటా

- **పేరు** : బస్తిపాడు నాగరాజు (పంచలింగాల నాగరాజు)
- **విద్యార్హత** : ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీఈడీ
- **జననం** : 1979 జూన్ 1
- **స్వగ్రామం** : పంచలింగాల గ్రామం
- **ప్రస్తుత వృత్తి** : రియల్ ఎస్టేట్, బిల్డర్
- **కుటుంబ నేపథ్యం** : తల్లిదండ్రులు బస్తిపాడు మహానందమ్మ (లేట్), నాగభూషణం. భార్య జయసుధ (గృహిణి), కుమారుడు కార్తిక్, కూతురు రిషిత

టికెట్ రేసులో తొమ్మిది మంది

కర్నూలు ఎంపీ టీడీపీ అభ్యర్థిగా బీసీలలో కురవ సామాజికవర్గానికి చెందిన బలమైన నాయకుడిని అన్వేషిస్తుందని తెలియగానే అదే సామాజికవర్గానికి చెందిన కర్నూలు రూరల్ మండలం పంచలింగాలకు చెందిన బస్తిపాడు నాగరాజు (బస్తిపాడు నాగరాజు), జిల్లాకు చెందిన హరియాణా గవర్నర్ ఓఎస్‌డీ, ఐటీ నిపుణుడు కురవ భానుశంకర్, ఆదోని పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బత్తిన లక్ష్మీనారాయణ, కర్నూలు నగరంలో ప్రముఖ ప్రైవేటు వైద్యశాల అమిలీయో ఆస్పత్రి అధినేత డాక్టర్ ప్రసాద్, సత్యం వెంచర్స్ ఇంజనీరింగ్ సర్వీసెస్ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజరు, సాఫ్ట్‌వేర్ ఇంజనీరు ఎంకే రాజశేఖర్, ఢిల్లీ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న పత్తికొండ వాసి పరమేశ్‌తో పాటుగా కర్నూలుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు లక్కీ టు సోదరుల్లో ఒకరు రాంపుల్లయ్య యాదవ్, టీడీపీ కర్నూలు నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అధిష్టానానికి బయోడేటాలు పంపారు. సర్వేలు, రాజకీయ సమీకరణాలు ఆధారంగా చివరికి పంచలింగాల నాగరాజును చంద్రబాబు ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు.

ఎంపీగా విజయం సాధిస్తా

నాపై ఎంతో విశ్వాసంతో కర్నూలు పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీ టీడీపీ అభ్యర్థిగా అధినేత, మాజీ సీఎం చంద్రబాబు ఎంపిక చేశారు. 1983లో టీడీపీ వ్యవస్థాపకులు దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ పత్తికొండ ఎమ్మెల్యే టికెట్ కురవలకు ఇచ్చారు. నాడు గెలిచి కానుకగా ఇచ్చాం. 40 ఏళ్ల తరువాత అధినేత చంద్రబాబు కురవను చట్ట సభలకు పంపాలనే లక్ష్యంతో నాకు ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చారు. జిల్లాలో పార్టీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఇలా అన్ని వర్గాలను నాయకులు, కార్యకర్తల సహకారంతో విజయం సాధించి అధినేతకు కానుకగా ఇస్తాం.

- బస్తిపాడు నాగరాజు, ఎంపీ అభ్యర్థి

పీవో, ఏపీవోలకు శిక్షణ తరగతులు



కర్నూలు(కలెక్టరేట్), మార్చి 22: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పీవో, ఏపీవోలకు జిల్లా స్థాయిలో మార్చి నెలాఖరులోపు, నియోజకవర్గ స్థాయిలో ఏప్రిల్ 10లోపు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఎన్నికల విధుల్లో పీవో, ఏపీవోల కీలకపాత్ర పోషించనున్నారు. జిల్లాలో 2204 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 2204 పీవోలు, 2204 ఏపీవోలు ఎన్నికల విధులు నిర్వహించనున్నారు.వీరితో పాటు అదనంగా 20 శాతం సిబ్బంది అనగా 2645 మంది రిజర్వులో ఉంటారు.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	కావాల్సిన సిబ్బంది
137: కర్నూలు	258	1548
138: పాణ్యం	357	2142
142: పత్తికొండ	255	1530
143: కోడుమూరు	275	1650
144: ఎమ్మిగనూరు	272	1632
145: మంత్రాలయం	237	1422
146: ఆదోని	256	1536
147: ఆలూరు	294	1764

సున్నా వడ్డీ డబ్బులెక్కడ ?

- సీఎం బటన్ నొక్కి 23 రోజులు
- రైతుల ఖాతాలో జమకాని వైనం
- ఆందోళనలో రైతులు





కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 22: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గత నెల 28న తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రైతులకు సున్నా వడ్డీ డబ్బులను రీయంబర్స్‌మెంటు చేస్తూ బటన్ నొక్కారు. 23 రోజులు కావస్తున్నా రైతుల బ్యాంకు ఖాతాలకు మాత్రం ఆ డబ్బులు జమ కాలేదు. బ్యాంకుల్లో ఆటంకాల వల్లా, లేక ప్రభుత్వ ఖజానా నుంచే బ్యాంకులకు డబ్బులు చేరలేదా? అనే సంగతి తెలియక రైతులు అయోమయానికి గురవుతున్నారు. 2022 ఖరీఫ్‌లో బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకుని వడ్డీ చెల్లించిన రైతులకు ప్రభుత్వం సున్నా వడ్డీ డబ్బు చెల్లిస్తూ సీఎం నొక్కిన బటన్ వ్యవహారం ఇలా ఉందని రైతులు విమర్శిస్తున్నారు. రూ. లక్షలోపు పంట రుణం తీసుకున్న రైతుల తరఫున గత తెలుగుదేశం ప్రభుత్వం తానే నేరుగా బ్యాంకులకు డబ్బు చెల్లించేది. జగన్ ప్రభుత్వం ఆ విధానాన్ని రద్దు చేసి రైతులు మొదట వడ్డీ చెల్లిస్తే.. ఆ తర్వాత జల్లెడ పట్టి, నిబంధనల పేరుతో అనేక రకాలుగా కొర్రీలు వేసి, వీలైనంత తక్కువ మంది రైతులను లబ్ధిదారుల జాబితాలో చేర్చి అరకొరగా వరి బ్యాంకు ఖాతాలకు డబ్బు జమ చేసే పద్ధతిని తీసుకొచ్చింది. ఈసారి 2022 సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో గత నెల 28వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సున్నా వడ్డీ రీయంబర్స్‌మెంటు డబ్బులను రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. నంద్యాల జిల్లాలో 9,891 మంది రైతులకు రూ.1,88,76,081ను సున్నావడ్డీ పథకం కింద రీయంబర్స్‌మెంటు చేశారు. బనగానపల్లెలో 11,373 మంది రైతులకు రూ.2,20,97,248, డోన్ నియోజకవర్గంలో 13,163 మంది రైతులకు రూ.3,03,87,139, నందికొట్కూరులో 9,860 మంది రైతులకు రూ.1,88,86,995, నంద్యాల నియోజకవర్గంలో 2,564 మంది రైతులకు రూ.54,25,488, పాణ్యం నియోజకవర్గంలో 2,134 మంది రైతులకు రూ.48,59,559, శ్రీశైలం నియోజకవర్గంలో 5,371 మంది రైతులకు రూ.1,03,27,415 వడ్డీ రీయంబర్స్‌మెంటు చేస్తూ రైతుల ఖాతాలకు జమ చేశారు. మొత్తం 7 నియోజకవర్గాల్లో 54,376 మంది రైతులకు రూ.11.08 కోట్లు సున్నా వడ్డీ పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. అదే విధంగా కర్నూలు జిల్లాలో ఆదోని నియోజకవర్గానికి సంబంధించి 3,626 మంది రైతులకు రూ.94.10 లక్షలు, ఆలూరు నియోజకవర్గంలో 17,068 మంది రైతులకు రూ.4.30 కోట్లు, కోడుమూరు నియోజకవర్గంలో 9,734 మంది రైతులకు రూ.2.01 కోట్లు, మంత్రాలయం నియోజకవర్గంలో 11,782 మంది రైతులకు రూ.2.71 కోట్లు, పాణ్యంలో 3,789 మంది రైతులకు రూ.94.35 లక్షలు, పత్తికొండ నియోజకవర్గంలో 21,833 మంది రైతులకు రూ.5.44 కోట్లు, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 8,819 మంది రైతులకు రూ.1.83 కోట్లు సున్నావడ్డీ పథకం కింద లబ్ధిదారులైన రైతులకు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ సీఎం జగన్ రెడ్డి బటన్ నొక్కారు. గత రెండేళ్లుగా పంటలు పండక, అప్పులు చేసుకుని అష్టకష్టాల్లో ఉన్న ఉమ్మడి జిల్లాలోని రైతులు సహకార సంఘాలు, వాణిజ్య బ్యాంకుల అధికారుల ఒత్తిడి తాళలేక అప్పు చేసి వడ్డీ చెల్లించారు. దాదాపు ఏడాది గడిచిపోయాక ప్రభుత్వం నింపాదిగా వడ్డీ డబ్బులను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే నెల రోజులు కావస్తున్నా తమ బ్యాంకు ఖాతాలకు వడ్డీ డబ్బు జమ కాలేదని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

కన్నీరు దిగమింగుకొని..

- తల్లి మరణించిన విషాదంలోనూ పరీక్షకు హాజరైన విద్యార్థి



తల్లి మృతదేహంపై పడి రోదిస్తున్న వీరస్వామి




ఆదోని (అగ్రికల్చర్), మార్చి 22 : తల్లి మరణించిన దుఃఖంలో మునిగిపోయి కూడా బాలుడు పదో తరగతి పరీక్షకు హాజరయ్యాడు. కన్నీటిని అదిమిపట్టుకొని తల్లికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోడానికి సిద్ధమయ్యాడు. ఆదోని పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన ఆర్టీసీ డ్రైవర్ రాజు భార్య జయశ్రీ కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. వ్యాధి తీవ్రం కావడంతో మూడు రోజుల కింద కర్నూలులోని ఓ ప్రైవేట్ నర్సింగ్ ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రికి వెళ్తూ జయశ్రీ తన కుమారుడు వీరస్వామిని దీవించి పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో పాస్ కావాలని, శుక్రవారం పుట్టినరోజుకు వస్తానని వెళ్లింది. కానీ చికిత్సకు కోలుకోలేక జయశ్రీ గురువారం మరణించింది. తల్లి మరణ వార్తను విని కుమారుడు వీరస్వామి గుండెలు బాదుకొని కన్నీళ్లు పెట్టుకున్నాడు. తల్లి మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు వీరాస్వామిని ఓదార్చి, పరీక్ష రాసి వచ్చాక ఖననం చేస్తామని చెప్పడంతో, దుఃఖాన్ని గుండెల్లో నింపుకొని శుక్రవారం పరీక్షకు హాజరయ్యాడు. పరీక్ష రాసి వచ్చి తల్లి మృతదేహంపై పడి గుండెలవిసేలా ఏడ్చాడు. అనంతరం జయశ్రీ అంత్యక్రియలు జరిగాయి

సీ-విజిల్ ఫిర్యాదులను పరిష్కరించండి

కలెక్టర్ జి. సృజన



కర్నూలు (కలెక్టరేట్), మార్చి 22: సీ-విజిల్ ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ జి. సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎన్నికల అంశాలపై ఆర్వోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీ-విజిల్ ఫిర్యాదులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో కొంత మంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అధికారులు బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడ్ ఉల్లంఘనపై పత్రికల్లో వచ్చిన వార్తలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆర్వోలను ఆదేశించారు. సువిధ యాప్ పని చేయని పక్షంలో నోడల్ అధికారుల నుంచి ఫిజికల్‌గా దరఖాస్తులు తీసుకుని రిటర్నింగ్ అధికారులు అనుమతులు ఇచ్చే సమయంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయాలన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో పాణ్యం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు ఆర్వో, నగర పాలక సంస్థ మున్సిపల్ చైర్మన్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ, కోడుమూరు ఆర్వో, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, పత్తికొండ ఆర్వో, ఆర్డీవో రామలక్ష్మి, మంత్రాలయం ఆర్వో మురళి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.



వైఛీప్ ప్లాన్

- వలంటీర్ల కుటుంబ సభ్యులతో ప్రలోభాలకు పన్నాగం..?
- రెండు నెలల క్రితమే వారి వివరాల సేకరణ
- ఓటర్లను మభ్యపెట్టేందుకు కుట్రలు

ఆత్మకూరు, మార్చి 22: ఎన్నికలు సమీపిస్తుండటంతో వలంటీర్ వ్యవస్థ ద్వారా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వైసీపీ కొత్త ఎత్తులు వేస్తోంది. వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలంటూ వలంటీర్లకు డబ్బు పంపిణీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ హెచ్చరికలు జారీ చేయడంతో తాజాగా ఆ పార్టీ మరో వ్యూహానికి తెరలేపినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం వలంటీర్లకు బదులు వారి కుటుంబ సభ్యులను రంగంలోకి దింపినట్లు సమాచారం. శ్రీశైల నియోజకవర్గంలో వైసీపీ నాయకులు వలంటీర్ వ్యవస్థను పరోక్షంగా వినియోగించుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిసింది. వలంటీర్లు నేరుగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని ఎన్నికల కమిషన్ పేర్కొంది. దీంతో అనేక చోట్ల వలంటీర్లు వైసీపీ నాయకులతో కలిసి ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారిని తొలగించారు. అదేవిధంగా శ్రీశైల నియోజకవర్గంలో కూడా వలంటీర్లు ఓటర్లను ప్రభావితం చేస్తే వదిలిపెట్టవద్దని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఇటీవల టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఓ వైపు ఎన్నికల అధికారులు, మరో వైపు ప్రతిపక్ష పార్టీల నాయకులు వలంటీర్లపై నిఘా ఉంచడంతో ప్రచారంలో పాల్గొనలేని పరిస్థితి నెలకొంది. దీంతో వలంటీర్ల కుటుంబ సభ్యుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసేందుకు వైసీపీ పన్నాగం పడినట్లు సమాచారం.

వలంటీర్ వ్యవస్థతో..

వలంటీర్‌లు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనరాదని, వారు వినియోగిస్తున్న ప్రభుత్వ సెల్‌ఫోన్ల సిమ్‌లు అందజేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. వలంటీర్‌లను ఎన్నికల కమిషన్ ఎక్కడికక్కడ కట్టడి చేయడంతో వైసీపీ నాయకులకు దిక్కుతోచక మరో వ్యూహానికి తెరలేపారు. ఈ పరిణామాన్ని వైసీపీ నాయకులు ముందే ఊహించారో ఏమో తెలియదు గాని రెండు నెలల క్రితమే ప్రతి వలంటీర్ తరఫున వారి కుటుంబ సభ్యుల నుంచి ఒకరిని ఎంపిక చేసుకొని ఓటర్లను ప్రలోభాలకు గురిచేయాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మహిళా వలంటీర్ అయితే ఆమె భర్త, పురుషుడైతే వారి సోదరులు, ఇతర బంధువర్గం నుంచి ప్రత్యామ్నాయంగా ఓ వ్యక్తిని ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే సదరు వలంటీర్ ద్వారా వారి పరిధిలోని కుటుంబాలకు జరిగిన లబ్ధి సమాచారాన్ని కూడా సేకరించి ప్రలోభాలకు గురిచేసేందుకు సిద్ధమవున్నట్లు తెలిసింది. అదేవిధంగా ఓటర్ల వద్దకు వలంటరీలు నేరుగా వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ఫోన్ల ద్వారా వీలైనంత వరకు వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేయించేందుకు ఆ పార్టీ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మొత్తానికి ఎన్నికల్లో వలంటీర్ వ్యవస్థ ప్రమేయం లేకుండా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకుంటుంటే వైసీపీ మాత్రం వలంటీర్ వ్యవస్థను ఎలాగైనా తమకు అనుకూలంగా వాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం.

పది పరీక్షలకు 903 మంది గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 22: కర్నూలు జిల్లాలో శుక్రవారం జరిగిన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ తెలిపారు. మొత్తం విద్యార్థులు 35,210 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 34,307 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 903 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. జిల్లా పరిశీలకుల అధికారి (డీఎల్‌వో) 5 పరీక్ష కేంద్రాలను, జిల్లా విద్యాశాఖ అధికారి 3 పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 7, సిట్టింగ్ స్క్వాడ్‌లు 44 పరీక్ష కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. ఎటువంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదని డీఈవో తెలిపారు.

రేపు హజ్ యాత్రికులకు శిక్షణ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 22: కర్నూలు జిల్లా జమియత్ ఉలమా, ఆల్ మదీనా సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో హజ్‌కు వెళ్లే యాత్రికులకు ఆదివారం శిక్షణ ఇవ్వనున్నట్లు జమియత్ ఉలమా జిల్లా అధ్యక్షుడు మౌలానా ఖాజీ అబ్దుల్ మజీద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు,నంద్యాల జిల్లాలకు సంబంధించి నగరంలోని అబ్బాసనగర్ యూనిక్ పాఠశాలలో జరిగే శిక్షణలో పాల్గొనే యాత్రికులకు భోజన వసతి కల్పించామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ హజ్‌కమిటి, ప్రైవేట్ టూర్స్ ద్వారా వెళ్లే హజ్ యాత్రికులు ఈ అవకాశాన్ని చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు 90328 75378 నంబరును సంప్రదించాలని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించండి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 22: భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం దాదాపు 33 నిత్యావసర సేవలు అందించే శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించినట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఆయా శాఖల ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం రాజకీయ పార్టీలు నిర్వహించే ఎలాంటి కార్యక్రమాలకైనా ముందుగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాల పరిధిలో ఉన్న ఎలక్ట్రానిక్ సీజర్స్ మేనేజ్‌మెంట్ సిస్టం వినియోగాన్ని పటిష్టపరచాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డా.జి. సృజన, డీఆర్వో మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌ను పూర్తి చేయాలి

ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి



డీఎంహెచ్‌వోను కలిసిన ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెంగళ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), మార్చి 22: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను కూడా వైద్య ఆరోగ్యశాఖ తరహాలోనే రెగ్యులరైజేషన్ చేయాలని ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి డీఎంహెచ్‌వో డా.వై. ప్రవీణ్ కుమార్‌ను కోరారు. ఈ మేరకు డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన ఆయనను ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు కలిసి అభినందనలు తెలిపారు. యాప్‌లను, లక్ష్యాలను వైద్య ఉద్యోగులు నెరవేర్చాలని, ఉద్యోగులకు సంబంధించిన ఆర్థికపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీఎంహెచ్‌వోను కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో కె.అరుణ, ఆఫీస్ సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీనివాసులు, ఏపీఎన్జీవో కర్నూలు సిటీ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఉగాది పురస్కారాలు

కర్నూలు, మార్చి 22: ఉమ్మడి కర్నూలు జిల్లా పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాలను ప్రకటించింది. పోలీసు శాఖ, అగ్నిమాపక శాఖ, విజిలెన్స్ విభాగాల్లో 2024 సంవత్సరానికి ఈ అవార్డులు ప్రకటించింది.



ఉత్తమ సేవా పథకం:

- విజయశేఖర్ (డీఎస్పీ, కర్నూలు)
- చెంచయ్య (ఆర్ఎస్ఐ, ఏపీఎస్‌పీ సెకండ్ బెటాలియన్ కర్నూలు)
- భీముడు నాయక్ (స్టేషన్ ఫైర్ ఆఫీసర్, ఆత్మకూరు ఫైర్ స్టేషన్)

కఠిన సేవా పథకం :

- ప్రసాద్ (పీసీ ఏపీఎస్‌పీ సెకండ్ బెటాలియన్)
- రాము (పీసీ ఏపీఎస్‌పీ సెకండ్ బెటాలియన్)

సేవా పథకం :

- శ్రీనివాసులు (ఎస్ఐ, కోడుమూరు)
- సాయిరామ్ (ఆర్ఐ, ఏపీఎస్‌పీ సెకండ్ బెటాలియన్)
- గౌస్ మొహిద్దీన్ (ఎస్ఐ, సీసీఎస్, నంద్యాల)
- ఓబులేసు (అర్ఎస్ఐ, కర్నూలు ట్రాఫిక్)
- శ్రీనివాసులు (హెచ్‌సీ, కర్నూలు త్రీటౌన్)
- రామాంజనేయులు (హెచ్‌సీ, గూడూరు పీఎస్)
- రామయ్య (హెచ్‌సీ, ఎస్పీ పోలీస్‌స్టేషన్)
- దామోదరం (ఏఆర్ హెచ్‌సీ, నంద్యాల)
- వెంకట సుబ్బయ్య (ఏఎస్ఐ, నంద్యాల టూటౌన్)
- మాసన్న (ఏఎస్ఐ, ఆత్మకూరు)
- కేవీ ప్రసాద్ (ఏఆర్ఎస్ఐ, ఏపీఎస్‌పీ సెకండ్ బెటాలియన్)
- సుందర్‌రాజు (ఏఆర్ఎస్ఐ, ఏపీఎస్‌పీ సెకండ్ బెటాలియన్)
- వేణుగోపాల్ (పీసీ, విజిలెన్స్)
- భరత్ కుమార్ (పీసీ, విజిలెన్స్)

వీడని ఉత్కంఠ!

- మూడో జాబితాలో కూడా లేని ఆదోని, ఆలూరు అభ్యర్థుల పేర్లు
- ఆశావహుల్లో టెన్షన్.. టెన్షన్

కర్నూలు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు శుక్రవారం రాష్ట్రంలో 13 మంది ఎంపీ అభ్యర్థులు, 11 మంది ఎమ్మెల్యే అభ్యర్థులతో మూడో జాబితా ప్రకటించారు. ఈ జాబితాలో ఆదోని, ఆలూరు అభ్యర్థులను ప్రకటిస్తారని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నాయకులు ఆశించారు. అయితే.. వివిధ కారణాల వల్ల మూడో జాబితాలో స్థానం దక్కలేదు. దీంతో ఆశావహులు, టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా పొత్తులో భాగంగా ఆదోని స్థానం బీజేపీ తీసుకుంది. స్థానిక రాజకీయ, సామాజిక పరిమాణాలు దృష్ట్యా ఆ స్థానం టీడీపీకే ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు బీజేపీ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఓ క్లారిటీ రాకపోవడంతో ఆదోని, ఆలూరు స్థానాలు పెండింగులో ఉంచారని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. అయితే.. బీజేపీ దిగి వస్తుందా..? ఎన్డీఏ కూటమి నాయకుల మదిలో తొలుస్తున్న ప్రశ్న ఇది. ఆ రెండు నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులుగా బరిలో దిగేదెవరు..? అంటూ ప్రజలు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. జిల్లాలో కర్నూలు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలు సహా పాణ్యంతో కలిపి ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. తొలి విడతలో కర్నూలు, పాణ్యం, పత్తికొండ, కోడుమూరు (ఎస్సీ) అభ్యర్థులు టీజీ భరత్, గౌరు చరిత, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరిలను అధినేత చంద్రబాబు ప్రకటించారు. ఈ నెల 16న రెండవ జాబితాలో ఎమ్మిగనూరు అభ్యర్థిగా బీవీ జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం అభ్యర్థిగా మాధవరం ఎస్.రాఘవేంద్రరెడ్డి పేర్లు ప్రకటించారు. పొత్తులో భాగంగా ఆదోని నియోజకవర్గం బీజేపీకి కేటాయించడంతో అక్కడ టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు విజయవాడకు పరుగులు పెట్టారు. అధినేత చంద్రబాబును కలిసి తనకు అవకాశం ఇవ్వాలని కోరారు.

టీడీపీ నేతల్లో టెన్షన్.. టెన్షన్

ఆదోని టికెట్‌ను పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించారు. అయితే.. ఆ నియోజకవర్గంలో వివిధ సామాజిక వర్గాల సహా మైనార్టీల బలాబలాలు, రాజకీయ సామాజికంగా పరిస్థితులు, గతంలో జరిగిన ఇరువర్గాల ఘర్షణలు.. వంటి కారణాల దృష్ట్యా బీజేపీకి కేటాయిస్తే ఆ ప్రభావం జిల్లాలో పలు నియోజకవర్గాలపై ఉంటుందని, ఎన్నికల్లో నష్టపోయే ప్రమాదం లేకపోలేదని పలువురు జిల్లా, రాష్ట్ర నాయకులు టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. అంతర్గత సర్వేల్లో కూడా పలువురు అదే విషయం వెల్లడించినట్లు తెలుస్తుంది. అదే క్రమంలో తనకు అవకాశం ఇస్తే తప్పక విజయం సాధిస్తానని నియోజవకర్గం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు సైతం చంద్రబాబును కలిసి వాస్తవ పరిస్థితులు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన బీజేపీ అధిష్టానంతో చర్చిస్తానని తెలిపారు. ఇందులో భాగంగా ఆదోని తమకు వదిలేసి మరో నియోజకవర్గంలో పోటీ చేయాలని టీడీపీ అధిష్టానం బీజేపీ పెద్దలతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. చర్చలు ఓ కొలిక్కి రాకపోవడంతోనే ఆదోని, ఆలూరు స్థానాల అభ్యర్థులను మూడో జాబితాలో ప్రకటించలేదని తెలిసింది. సంప్రదింపుల్లో భాగంగా బీజేపీ ఓ మెట్టు దిగివచ్చి ఆదోని వదులుకుంటే ఆలూరు బీజేపీకి ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. అదే జరిగితే ఆలూరు టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, టీడీపీ మాజీ ఇన్‌చార్జిలు వీరభద్రగౌడ్, వైకుంఠం మల్లికార్జున, వైకుంఠం జ్యోతిలకు నిరాశ తప్పదు. ఒకవేళ అనంతపురం జిల్లా గుంతకల్లు సీటు బీజేపీ తీసుకుంటే ఆలూరు నుంచి మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం బరిలో దిగే అవకాశం లేకపోలేదు. ఆదోని టికెట్ విషయంలో బీజేపీ పట్టువీడకపోతే మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు సహా ఇక్కడ టికెట్ ఆశించిన నాయకులకు నిరాశ తప్పదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లో బీజేపీని చంద్రబాబు ఒప్పిస్తారని, మీనాక్షినాయుడుకే టికెట్ వస్తుందని ఆయన వర్గీయులు పూర్తి విశ్వాసంతో ఉన్నారు. అలాగే.. మంత్రాలయం టికెట్ వాల్మీకి సామాజికవర్గానికి చెందిన రాఘవేంద్రరెడ్డికి ఇవ్వడంపై నియోజకవర్గం ఇన్‌చార్జి తిక్కారెడ్డి, ఆయన వర్గీయులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. వైసీపీ నుంచి వచ్చిన వారికి టికెట్ ఎలా ఇస్తారని, పునరాలోచించి తిక్కారెడ్డికే టికెట్ ఇవ్వాలంటూ ఆయన వర్గీయులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. మూడో జాబితాలో ఎలాంటి మార్పు లేకపోవడంతో తిక్కారెడ్డి వర్గీయులు కూడా నిరాశతో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగేందుకు తిక్కారెడ్డి సిద్ధం అవుతున్నారు.

తహసీల్దార్, వీఆర్‌వోలపై కేసు నమోదు

పెద్దకడుబూరు, మార్చి22: నకిలీ దస్ర్తాలను సృష్టించి స్వామినాథన్ భూమిని సొంతం చేసుకునేందుకు సహకరించిన మండల తహసీల్దార్, వీఆర్‌వో, కంప్యూటర్ ఆపరేటర్‌లపై పెద్దకడుబూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. శుక్రవారం ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఆదోని పట్టణంలో నివాసం ఉంటున్న స్వామినాథన్‌కు చిన్నతుంబళం గ్రామంలో 2.52 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని సింగరాజనహళ్ళికి చెందిన లోకేశ్వర్ రెడ్డి, అంగాస్కల్ రూప నకిలీ దస్ర్తాలను సృష్టించి తమ పేరుపై నమోదు చేసుకున్నారు. దీనికి అప్పటి తహసీల్దార్ కుమార స్వామి, వీఆర్వో బీటీ సురేష్, కంప్యూటర్ ఆపరేటర్ రమేష్ సహకరించారు. ఆ భూమిని సాగు చేసుకునేందుకు లోకేశ్వర్‌రెడ్డి ప్రయత్నిస్తుండగా స్వామినాథన్ అడ్డుకున్నాడు. ఈ భూమి తనదని లోకేశ్వర్‌రెడ్డి బెదిరించడంతో స్వామినాథన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రాన్ని డ్రగ్స్ రాజధానిగా మార్చేసిన వైసీపీ



పర్యటిస్తున్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, బైరెడ్డి శబరి

ఓర్వకల్లు, మార్చి 22: రాష్ట్రాన్ని డ్రగ్స్ రాజధానిగా వైసీపీ ప్రభుత్వం మార్చివేసిందని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, టీడీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బైరెడ్డి శబరి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, మహిళలపై, దళితులపై, బీసీలపై వైసీపీ ప్రభుత్వ హయాంలో దాడులు పెరిగాయన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెడతారన్నారు. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి హయాంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి ప్రాజెక్టులు చేయలేదని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో సిద్ధం అంటూ రావడానికి సిగ్గు లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, శ్రీరాములు, భూషన్న, నాగేశ్వరరావు, రామాంజనేయులు, కురువ జయన్న, వందనాలు పాల్గొన్నారు.

వలంటీర్ల తొలగింపు

కల్లూరు, మార్చి 22: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమించిన చిన్నటేకూరు గ్రామ సచివాలయం వలంటీర్ రామగోపాల్‌ను తొలగించినట్లు కల్లూరు ఎంపీడీఓ జీవీ రమణ మూర్తి తెలిపారు. సోషల్ మీడియాలో అధికార వైసీపీకి అనుకూలంగా పోస్టులు పెట్టారని ఫిర్యాదు అందడంతో విచారణ చేసి తొలగించామన్నారు. అలాగే కల్లూరు అర్బన్ 33వ వార్డులోని 99వ సచివాలయం వలంటీరు శివను తొలగించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. 33వ వార్డు పరిధిలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితోపాటు పార్టీ కండువా మెడలో వేసుకుని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని ఫిర్యాదు వచ్చింది. విచారణ అనంతరం ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన శివను తొలగించినట్లు స్పష్టం చేశారు.

బాలుడికి పాముకాటు

కర్నూలు ఆసుపత్రికి తరలింపు

గోనెగండ్ల, మార్చి 22: మండల పరిధిలోని చిన్న మరివీడు గ్రామానికి చెందిన ఆర్యన్(6) అనే బాలుడ్ని శుక్రవారం సాయంత్రం పాము కరిచింది. గ్రామానికి చెందిన లింగన్న కుమారుడు ఆర్యన్ బాత్‌రూమ్‌కు వెళ్లగా ఈ ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యసేవల కోసం కర్నూలు అసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కొవెలకుంట్ల, మార్చి 22 : విద్యుదాఘాతంతో శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని కంపమల్ల గ్రామానికి చందిన తలారి శివరాముడు కుమారుడు శివప్రసాద్ (25) కోవెలకుంట్ల పట్టణంలోని పాండురంగస్వామి వెనుకభాగంలో ఉన్న వెల్డింగ్ షాపులో పని చేస్తున్నాడు. వెల్డింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ వైర్ గాయపడడంతో కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. మృతుని భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నందవరం, మార్చి 22 : రోడ్డు ప్రమాదంలో ప్రమాదానికి గురైన కురవ బీరప్ప చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఐదు రోజుల క్రితం నందవరం దగ్గరలోని ముగతి గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న బీరప్ప కుక్క అడ్డు రావడంతో కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి ఉంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

నందవరం, మార్చి 22: మండలంలోని నందవరం గ్రామ సమీపంలోని బైకు అదుపుతప్పిన ఘటనలో ప్రకాష అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం జరిగింది. నందవరం ఎస్ఐ తిమ్మయ్య సంఘటన స్థలం దగ్గరకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ప్రకాష్ మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి ఆత్మహత్య

బనగానపల్లె, మార్చి 22 : బనగానపల్లె పట్టణంలో శుక్రవారం ఉరి వేసుకొని ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. బీహార్‌కు చెందిన చంపాదే వి (30) పట్టణంలోని సాయిబాబా ఆలయ సమీపంలో గల ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో పని చేస్తోంది. ఈమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. వీఆర్వో ఈశ్వర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంట సుబ్బారావు తెలిపారు.

శ్రీశైల దేవస్థానంలో అంతర్గత బదిలీలు

శ్రీశైలం, మార్చి 22: శ్రీశైలం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న 32 మంది శాశ్వత ఉద్యోగులు, పొరుగు సేవల సిబ్బందిని అంతర్గత బదిలీ చేస్తూ ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు ఉత్తర్వులను జారీ చేశారు. దేవస్థానం పరిపాలన సౌలభ్యం దృష్ట్యా ఈ బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది. బదిలీలో భాగంగా కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం పదోన్నతిపై శ్రీశైలం దేవస్థానంలో విధులు కేటాయించిన డిప్యూటీ కమిషనర్, డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్. రమణమ్మకు విధులను కేటాయించారు. వెంటనే రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉల్లంఘించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

మినీ లారీ.. ఆర్టీసీ బస్సు ఢీ

15 మందికి గాయాలు



గాయాలపాలైన వ్యక్తిని తరలిస్తున్న పోలీసులు

బండిఆత్మకూరు, మార్చి 22: మండలంలో మినీ లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో 15 మంది గాయాలపాలయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3.15 గంటల సమయంలో నంద్యాల నుంచి ఆత్మకూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, వెలుగోడు వైపు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న మినీ లారీ ఢీకొన్నాయి. ఆర్టీసీ బస్సులో ఉన్న బోయరేవుల మధుశేఖర్, మద్దయ్య, రూపనగూడి వెంకట సుబ్బయ్య, ఆత్మకూరుకు ప్రాంతానికి చెందిన తిక్కస్వామి, లింగమ్మ, డ్రైవర్ మహమ్మద్ ఖాజా, సుజాత, అహమ్మద్, చంద్రశేఖర్, రాముడు, అలాగే మినీ లారీలో ఉన్న వెలుగోడుకు చెందిన డ్రైవర్ నజీర్, ప్రవీణ్‌కుమార్, మల్లికార్జున, కంబగిరిలకు గాయాలయ్యాయి. వీరిలో కొందరికి బండిఆత్మకూరు ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి, అనంతరం 108 వాహనంలో నంద్యాలు తరలించారు. మరికొందరు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

ఆంధ్రప్రగతి బ్యాంకులో చోరీకి యత్నం

సి. బెళగల్, మార్చి 22: మండల కేంద్రంలో ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో చోరీ చేయడానికి గుర్తు తెలియని దుండగులు గురువారం అర్ధరాత్రి ప్రయత్నించారు. అయితే బ్యాంక్ సైరన్ మోగడంతో దుండగులు పరార్ అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ తిమ్మారెడ్డి క్లూస్ టీమ్‌తో విచారణ చేపట్టారు. ఎటువంటి ఆధారాలు లభించలేదు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

పెళ్లి ఇంట విషాదం

గోనెగండ్ల, మార్చి 22: గోనెగండ్లలోని ఎల్లెల్సీలో ప్రమాదవశాత్తు మునిగి అరుణ్‌కుమార్ (6) అనే బాలుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన లక్ష్మపేట కాలనీలో గొల్ల నాగరాజు అనే వ్యక్తి ఇంట్లోని వివాహానికి మల్కాపురం గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి తన భార్య జ్యోతి, ఇద్దరు కుమారులతో హాజరయ్యాడు. చిన్న కుమారుడు అరుణ్‌కుమార్ మల్కాపురంలో ఒకటో తరగతి చదువుతున్నాడు. వివాహం అయ్యాక పెద్దలు పెళ్లి సందడిలో ఉండగా అరుణ్‌కుమార్, మరి కొంత మంది పిల్లలు కాలనీ పక్కనే ఉన్న ఎల్లెల్సీలో ఈత కొట్టేందుకు వెళ్లారు. పెద్ద పిల్లలు కాలువలో దూకి ఈత కొడుతుండగా అరుణ్‌కుమార్ కాలువ మెట్ల దగ్గర నీటిలో ఈత కొడుతున్నాడు. నీటి ప్రవాహం పెరగడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పోయాడు. తోటి పిల్లలు కేకలు వేయడంతో అక్కడ ఉన్న వ్యక్తులు వచ్చి అరుణ్‌కుమార్‌ను బయటకు తీశారు. తల్లిదండ్రులు, బంధువులు బాలుడ్ని ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అరుణ్‌కుమార్ మృతదేహాన్ని సొంత గ్రామం మల్కాపురానికి తీసుకువెళ్లారు. బాలుడి మృతితో పెళ్లి ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి.

కర్నూలు

రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొంటే చర్యలు

ఆర్‌ఓ ఎ.భార్గవతేజ



మాట్లాడుతున్న ఆర్‌ఓ ఎ.భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 22: రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) ఎ.భార్గవ తేజ రీసోర్స్ పర్సన్లకు హెచ్చరించారు. శుక్రవారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఎస్‌బీఐ కాలనీలోని న్యూకౌన్సిల్ హాలులో మెప్మా అధ్వర్యంలో ప్రజలకు ఓటు వినియోగంపై రీసోర్స్‌పర్సన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవతేజ మాట్లాడుతూ ఓటర్లకు తమ ఓటు హక్కు వినియోగంపై మాత్రమే అవగాహన కల్పించాలన్నారు. ఫలానా పార్టీకో, ఫలానా గుర్తుకు ఓటు వేయండని చెప్పడం నేరమన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుక నేలా ఆర్‌పీలు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికి అర్హత ఉండి ఓటరుగా నమోదు చేసుకోని ప్రతి ఒక్క పౌరుడిని దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ప్రజలకు ఓటు విలువ తెలియజేసేందుకు సాంస్కృతిక, కళాజాత, ముగ్గుల పోటీలాంటి చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ నాగశివలీల, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, సీఎంఎం మురళి, సోషల్ డెవలప్ మెంట్ స్పెషలిస్టు పెంచలయ్య, ఆర్‌పీలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 22: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎన్నికల నియమావళి ప్రవర్తన జిల్లా నోడల్ అధికారి, జడ్పీ సీఈఓ జి.నాసరెడ్డి అన్నారు. శుక్రవారం జడ్పీలోని ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన వెంటనే జడ్పీ ఆవరణలో మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలలో రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లు, వాల్ రైటింగ్‌ను ఇప్పటికే గుర్తించి తొలగించామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లం ఘించి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న 12 మంది వలంటీర్లను ఉద్యోగాల నుంచి తొలగించామన్నారు. నగరంలో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్‌పై ఎంసీసీకి ఫిర్యాదు అందిందని, దానిపై సమగ్ర విచారణ చేపడుతున్నామని ఆయన తెలిపారు.

విధుల నుంచి తొలగింపు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 22: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఒకరిని విధుల నుంచి తొలగిస్తూ కర్నూలు నగర పాలక అధికారులు చర్యలు తీసుకున్నారు. నగర పాలక సంస్థలో ఆప్కాస్ ద్వారా నియమితులైన చెత్త సేకరణ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న కె.రమేష్ గురువారం ఆయా రాజకీయ పార్టీలకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు పత్రికల్లో వార్తలు రావడంతో అతనిపై విచారణ నిర్వహించి విధుల నుంచి తొలగించినట్లు నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఒక ప్రకటనలో తెలిపారు.

బెల్టుషాపు నిర్వాహకులపై కేసు

కర్నూలు(అర్బన్), మార్చి 22: ఓర్వకల్లు మండలంలో అక్రమంగా బెల్టుషాపు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేశామని సెబ్ సీఐ కేబీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం లొద్దిపల్లెలో కురవ లక్ష్మిదేవి నుంచి 48 బాటిళ్లు, మండ్ల దస్తగిరి వద్ద నుంచి 30 బాటిళ్లు, ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఏ.వెంకటేశ్వర్లు నుంచి 48 మద్యం బాటిళ్లు సీజ్ చేసి అదు పులోకి తీసుకుని కేసులు నమోదు చేశామని తెలిపారు.

టీడీపీ విజయానికి సమష్టిగా కృషి చేయాలి

గౌరు చరిత, బైరెడ్డి శబరి


గుట్టపాడులో టీడీపీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరిస్తున్న గౌరు చరిత, బైరెడ్డి శబరి

ఓర్వకల్లు, మార్చి 22: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషి చేయాలని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, టీడీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం మండలంలోని గుట్టపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రజాగళం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరు చరిత, బైరెడ్డి శబరి, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌లు హాజరయ్యారు. అనంతరం వారు నాయకులు, కార్యకర్తలు ఇంటిం టికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజ లకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారాన్ని దక్కించుకుని రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. వైసీపీ అధికారంలోకి రాగానే బీసీలు, దళితులపై దాడులు, హత్యలు జరుగుతున్నా సీఎం జగన్ మిన్నకుండటం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు మోహన్ రెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెంకటరమణ, పుల్లారెడ్డి, నాగిరెడ్డి, మహబూబ్‌బాషా, విశ్వేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, సుధాకర్‌రావు, శ్రీరాములు, రామకోటే శ్వరరావు, నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసలు

» గౌరు చరిత సమక్షంలో ఎ.గోకులపాడు వైసీపీ ఎంపీటీసీతోపాటు వంద కుటుంబాలు చేరిక


టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, మార్చి 22: పాణ్యం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి వైసీపీ నుంచి వలసలు కొనసాగుతున్నాయి. శుక్రవారం కల్లూరు మం డలం టీడీపీ అధ్యక్షుడు డి.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఎ.గోకులపాడుకు చెందిన వైసీపీ ఎంపీటీసీ లక్ష్మీదేవి, భర్త మాజీ సర్పంచు నాగరాజుతోపాటు వంద కుటుంబాలు పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత సమక్షంలో టీడీపీలో చేరారు. ఎ.గోకులపాడు ఎంపీటీసీ లక్ష్మీదేవి దంపతులకు గౌరుచరిత కండు వాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సురేష్‌రెడ్డి, శివ, షేక్షావలి, ఆర్బీసీ రమణారెడ్డి, నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, రఘురెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పురుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, మాజీ ప్రభుత్వ న్యాయవాది నాగముని పాల్గొన్నారు.

● టీడీపీలో చేరిన కొర్రపోలూరు వైసీపీ నాయకులు: గడివేముల మండలం కొర్రపోలూరుకు చెందిన హుసేన్, నబిరసూల్‌తోపాటు 50 కుటుంబాలు పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం గౌరు స్వగృహంలో టీడీపీ అధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులకు కండువాలు కప్పి గౌరు దంపతులు పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో షేక్‌నబిషా, ఆలి బాషా, మాలిక్‌బాషా, చిన్నస్వామి, జమ్మలయ్య, వెంకటశివుడు ఉన్నారు. టీడీపీ నాయకులు జయన్న, పెద్దస్వామి, చిన్న వెంకటస్వామి పాల్గొన్నారు.

● చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు మారుతీనగర్‌లో ఆమె శంఖారావం, సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, వార్డు ఇన్‌చార్జి ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, వంగాల జనార్దన్‌రెడ్డి, నాగముని, విజయ్, రమేష్, మౌలాలి పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన ఎంపీ అభ్యర్థి బస్తిపాడు నాగరాజు


నాగరాజును అభినందిస్తున్న కార్పొరేటర్లు

కర్నూలు(అర్బన్), మార్చి 22: తెలుగుదేశం పార్టీతోనే బీసీ సామాజిక వర్గం అభివృద్ధి సాధ్యమని టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాడు నాగరాజు అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చంద్రబాబు ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో తన పేరు ప్రకటించడంతో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అంతక ముందు ఎన్టీఆర్ విగ్రహనికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కురువ సాధికార కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మాజీ రాష్ట్ర కార్యదర్శి చిట్లాని అరుణకుమారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● టీడీపీ ఎంపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తాం: కార్పొరేటర్

కర్నూలు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి బస్తిపాడు నాగరాజు గెలుపే లక్ష్యంగా పని చేస్తామని నగర 8వ వార్డు కార్పొరేటర్ కురువ పరమేష్ తెలిపారు. శుక్రవారం నగరంలోని నాగరాజు నివాసంలో ఆయనను కలిసి అభినందించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్


భరోసా యాత్రలో మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 22: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని 16వ వార్డు బుధవారపేటలో టీజీ భరత్ భరోసా యాత్ర చేపట్టారు. ఈ ఐదేళ్ల పాలన చూసిన ప్రజలందరూ వచ్చే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే నగరంలో ఉన్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమం, అభివృద్ధి అందాలన్న ఉద్దేశంతో చంద్రబాబు సూపర్ 6 పథకాలను తీసుకొచ్చారన్నారు. ఈ ప్రభుత్వంలో ఉద్యో గాల నోటిఫికేషన్లు రాక పోవడంతో యువత నిరాశలో పడిపోయారన్నారు. చంద్రబాబు విజన్‌తో రాష్ట్రానికి పరిశ్రమలు తరలిరావడం ఖాయమన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయకుమారి, మాజీ కార్పొరేటర్లు రామాంజ నేయులు, అబ్బాస్, పామ న్న, టీడీపీ సీనియర్ నాయకులు బాబ్జీ, గున్నా మార్క్, నాయకులు క్రాంతి, జనసేన రాయలసీమ ఎన్నికల కన్వీనర్ పవన్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఘనంగా శాలివాహన జయంతి

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 22: శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలను నగరంలోని బీసీ భవన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు సోమేష్ హాజరై మాట్లాడుతూ శాలివాహన చక్రవర్తి నవశకానికి నాంది పలికారన్నారు. రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ శాలివాహన చక్రవర్తి శాతవాహన రాజులలో 23వ రాజు అని భారతదేశం అంతటిని పరిపాలించిన ఏకైక రాజు అన్నారు. ఆయన తండ్రి శాతకర్ణి తరువాత రాజయ్యేనున్నారు. కార్యక్రమంలో శ్రీశైల శాలివాహన నిత్యఅన్నదాన సత్రం ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, లింగన్న, నగర అధ్యక్షులు మధు, గుమ్మకొండ రమేష్, లక్ష్మన్న, ఎర్రబాడు వెంకటేశ్, లలితమ్మ, వెల్ఫేర్ కమిటీ సభ్యులు లక్ష్మీదేవి, నరసమ్మ పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలి



ఓటర్ల అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ

కల్లూరు, మార్చి 22: ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని పాణ్యం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పిలుపునిచ్చారు. శుక్రవారం కల్లూరు అర్బన్ వీకర్‌సెక్షన్, ఇందిరా గాంధీ కాలనీల్లో పోలింగ్ కేంద్రాలను ఆర్వో పరిశీలించారు. అనంతరం స్వీప్ కార్యక్రమంలో భాగంగా వీకర్‌సెక్షన్ కాలనీ జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ఇందిరాగాంధీ కాలనీ వరకు ఓటర్ల అవగాహన ర్యాలీ లో నారపురెడ్డిమౌర్య పాల్గొన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వందశాతం నమో దుకు ఎన్నికల సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఓటు యొక్క పాముఖ్యతను ఓటర్లకు వివరించారు. కల్లూరు తహసీల్దారు మునివేలు, బూత్ స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి : తెలుగు యువత

గూడూరు, మార్చి 22: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు కురువ హనుమంతు అన్నారు. శుక్రవారం పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు కురువ హనుమంతు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజును కలిసి అభినందించారు. కురువ హనుమంతు మాట్లాడుతూ కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు గెలుపు కోసం టీడీపీ శ్రేణులు సైనికుల్లా పనిచేయా లన్నారు.

దోమల నివారణకు చర్యలు

కర్నూలు(హాస్పిటల్), మార్చి 22: నగరంలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా పొడి వాతావరణంలో ఉంచుకోవడంతో దోమలను అరికట్టవచ్చునని డీఎంహెచ్‌వో డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ అన్నారు. నగరంలోని గడ్డ స్ట్రీట్‌లో జరుగుతున్న ఫ్రైడే-డ్రైడే కార్యక్ర మాన్ని ఆయన పరిశీలించారు. ఇంటి పరిసరాల ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు ఆయన సూచించారు.

కార్మిక జెండాలను తొలగింపు అన్యాయం

కర్నూలు(న్యూసిటీ), మార్చి 22: ఎన్నికల నిబంధనల పేరుతో నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ కార్మిక జెండాలను తొలగించడం అన్యాయ మని సీపీఎం పాతబస్తీ కార్యదర్శి రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక సంఘాల గుర్తు సుత్తి, కొడవలి, సీపీఎం గుర్తు సుత్తి, కొడవలి, నక్షత్రం అని ఎన్నికల నిబంధనలు అడ్డంపెట్టుకుని జెండాలు తొలగించడం అప్రజాస్వా మికమని అన్నారు. సుత్తి, కొడవలి గుర్తు ఉండే జెండాలకు ముసుగులు తొలగించి పోళ్లకు తెల్లపెయింట్ వేస్తున్నారని అన్నారు.

పంచలింగాలలో టీడీపీ శ్రేణుల సంబరాలు

కర్నూలు(రూరల్), మార్చి22: కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలో టీడీపీ కార్యకర్తలు, గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు. ఆ గ్రామానికి చెందిన ఎంపీటీసీ మెంబర్, టీడీపీ బీసీ రాష్ట్ర సాధికారిక సమితి సభ్యుడు బస్తిపాడు కురువ నాగరాజుకు శుక్రవారం కర్నూలు ఎంపీ టీడీపీ టికెట్‌ను కేటాయించడంతో గ్రామస్థులు బాణా సంచ కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు. తొలిసారిగా తమ గ్రామానికి చెందిన నాగరాజుకు టీడీపీ ఎంపీ టికెట్ రావడం ఆనందంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. నాగరాజుకు టికెట్ ప్రకటించగానే భారీగా టీడీపీ నాయ కులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయన స్వగ్రామానికి చేరుకొని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతు రాష్ట్రంలో బీసీలకు చంద్రబాబు ఎంతో ప్రాధాన్యం కల్పించారన్నారు. తనపై నమ్మకంతో కర్నూలు పార్లమెంట్ సీటును ఇచ్చిన చంద్రబాబు, నారాలోకేష్, అచ్చెన్నాయుడిలకు నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో టీడీపీ నేతలు కేఈ కృష్ణమూర్తి, కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, కేఈ ప్రభాకర్, పార్టీ అధ్యక్షుడు బీటీ నాయుడు కో-ఆర్డినేటర్లు ప్రభాకర్‌చౌదరి, బీద.రవిచంద్రయాదవ్‌లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్దన్ రెడ్డిని నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికలో సహాయ సహకారాలు అందించాలని ఆయన విష్ణును కోరారు. కాగా కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి నాగరాజు, కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ఇద్దరిది కర్నూలు రూరల్ మండలం కావడం విశేషం.


విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసిన బస్తిపాడు నాగరాజు

ప్రకటనలకు అనుమతి తీసుకోవాలి: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 22: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రసార మాధ్యమాల్లో ప్రచురితమయ్యే, ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.సృజన ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అనుసరించి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కమిటి ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతో పాటు చెల్లింపు వార్తలను (పెయిడ్ న్యూస్) పర్యవేక్షిస్తుందని, మీడియా ఉల్లంఘనలు కూడా గుర్తించి తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. రిజిస్టర్ కాబడిన జాతీయ, రాష్ట్ర, రాజకీయ పార్టీలు కానీ వారి తరుపున ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలను ప్రచారం చేసేందుకు అనుమతి కోసం నిర్దీత నమూనాలో మూడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రిజిస్టర్ కాని రాజకీయ పార్టీలు, ఇతర వ్యక్తులు వారి ప్రకటన ప్రచారం చేయుటకు 7 రోజుల ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు అందిన రెండు రోజుల్లోగా జిల్లా స్థాయి ఎంసీఎంసీ కమిటీ అనుమతి మంజూరు చేస్తుందన్నారు.

వార్తాపత్రికల్లో పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందు రోజు తప్పనిసరిగా ఎంసీఎంసీ నుంచి అనుమతి పొంది ప్రకటన ప్రచురించాల్సి ఉంటుందన్నారు. సినిహా హాళ్లలోనూ, ప్రైవేటు ఎఫ్ఎం రేడియోలలో, ఎలక్ట్రానిక్ పత్రికల్లోనూ, ప్రసారమయ్యే ప్రచు రితమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలు కూడా తప్పనిసరిగా ముందస్తు వీకరణ పొందాల్సి ఉంటుందన్నారు. అనుమతి పొందిన ఆర్డర్ నెంబర్‌ను సంబంధిత ప్రకటనపై సూచించాల్సి ఉంటుందన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కోడుమూరు(రూరల్), మార్చి 22: కోడుమూరు సెబ్ పోలీసులు కర్ణాటక మద్యం పట్టుకున్నారు. సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపిన వివరాల మేరకు.. కోయిలకొండ-కటారుకొండ దారిలో రెండు బైక్‌లపై తరలిస్తున్న 15 బాక్సుల మద్యం పట్టుకున్నామని, వాటిల్లో మొత్తం 1440 కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. నిందితులు బల్లె రాముడు, నెరి జల్లా రమేష్‌లను అరెస్టు చేసి రిమాండ్ తరలించామన్నారు. పట్టుకున్న మద్యం, నిందితులు వినియోగించిన మద్యం సీజ్ చేశామన్నారు. కాగా వరుస దాడులు చేపట్టి భారీఎత్తున మద్యం, నాటుసారా పట్టుకోవడంలో అంకితభా వంతో పనిచేసిన సిబ్బందికి సీఐ క్యాష్ రివార్డు అందజేశారు. సెబ్ ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది హనుమంతు, శంకర్‌నాయక్, వీరుపాక్షిరెడ్డి, వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.

లక్ష్మీమాధవ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కోడుమూరు(రూరల్), మార్చి 22: మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. శుక్రవారం రాత్రి బాజాభజంత్రీల మధ్య మాధవస్వామిని వరుడిగా ముస్తాబు చేశారు. పూజారులు శాస్త్రోక్తంగా పూజలు చేస్తూ మాధవుడిని పెళ్లికుమారుడిగా అలంకరించారు.

ఆర్‌యూ కర్నూలు జట్టుకు కాంస్యం

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 22: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పురుషుల సెపక్‌తక్రా చాంపియన్‌షిప్‌లో రాయలసీమ యూనివర్సిటీ కర్నూలు జట్టు కాంస్య పతకం సాధించింది. ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పురుషుల కోసం రాయలసీమ విశ్వవిద్యాలయం కర్నూలు ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ నుంచి 20 వరకు ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆదోనిలో జరిగింది. ఈ చాంపియన్‌షిప్‌లో ఆర్‌యూ కర్నూలు రేగు ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించారు. జట్టు సభ్యులను వైస్ చాన్స్‌లర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్, రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ ఎన్.అంకన్న అభినందించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న విశ్రాంత ఎస్పీ

కర్నూలు(కల్చరల్), మార్చి 22: నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో ఉపవాసం ఉన్న నిరుపేద ముస్లిం మహిళలకు శుక్రవారం విశాఖపట్నం ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్ రెండో కుమార్తె హమీదా, బాషా దంపతులు ఏర్పాటు చేసిన ఉచిత నిత్యావసర సరుకులను విశ్రాంత ఎస్పీ ఇంజేటి వెంకటేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఎస్పీ ఇంజేటి వెంకటేష్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాసం ఉంటున్న పేదవర్గాలకు చేసే దానధర్మాలకు ఎంతో విశిష్టత ఉందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత ఆధ్వర్యంలో నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కోడుమూరు ఆర్వో శేషిరెడ్డి

గూడూరు, మార్చి 22: మండలంలోని గూడూరు, చనుగొండ్ల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కోడుమూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ ఎం శేషిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో వసతులపై ఆరా తీశారు. ఆయన వెంట ఏఈఆర్వో ఉదయ్ సంతోష్, ఆర్ఐ వరలక్ష్మీ, ఏఎస్‌వో పద్మజ, కంప్యూటర్ ఆపరేటర్ హనుమంతు ఉన్నారు.

దివ్యాంగ, వయోవృద్ధ ఓటర్లకు సౌకర్యాలు

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 22: దివ్యాంగ, వయోవృద్ధ ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు స్వీప్ నోడల్ అధికారి పీవీ రమణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో శుక్రవారం జరిగిన దివ్యాంగులు, అంధులు, వికలాంగులు, వయోవృద్ధులకు, ట్రాన్స్‌జెండర్లకు పోలింగ్ కేంద్రాల్లో త్వరగా ఓటు వేయడానికి తగిన సౌకర్యాలు కల్పించడంపై అవగా హన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడబ్ల్యూడీ ఓటర్ల సౌలభ్యం కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంప్, వీల్‌చైర్ మొదలైన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే 85 ఏళ్ల పైబడిన వారు, 40 శాతం మేర అంగవైకల్యం ఉన్నవారు ఇంటివద్దనే ఓటు వేసేందుకు ఆదేశాలు జారీ అయ్యాయని తెలిపారు. కాబట్టి వారు సంబంధిత రిటర్నింగ్ అధికారికి ఫారం-12డి ద్వారా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రయిస్ ఫాతిమా మాట్లాడుతూ ఏప్రిల్ 15వ తేదీ వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉందని, ఇంకా ఎవరైనా ఓటు నమోదు చేసుకోకుంటే వెంటనే నమోదు చేసుకోవాలని తెలిపారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ జనరల్ సెక్రటరీ అనిల్, ఇంటర్నేషనల్ పారా అథ్లెటిక్ బి.రామాంజనేయులు, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ హెచ్.చంద్రన్న మాట్లాడుతూ మండల, నియోజకవర్గ స్థాయిలో పీడబ్ల్యూడీ ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

నేడు శనీశ్వర స్వామి ఆలయంలో పూజలు

కర్నూలు(కల్చరల్), మార్చి 22: నగరంలోని సంకల్‌బాగ్‌లో హరిహర క్షేత్రం సమీపంలోగల శనీశ్వర స్వామి ఆలయంలో శనివారం రోజున 'శని త్రయోదశి' సందర్భంగా ప్రత్యేక పూజాది కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నగర శ్రీ గీతా ప్రచార సంఘం అధ్యక్ష కార్యదర్శులు డీవీ రమణ, జగన్నాథ గుప్త తెలిపారు. ఈ పూజాది కార్యక్రమాలు శ్రీ గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో, దేవాలయం అర్చకులు టీపీ రంగస్వామి నేతృత్వంలో జరుగుతాయని అన్నారు.


● రేపు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

నగరంలోని సంకల్‌బాగ్‌లోగల హరిహర క్షేత్రంలో ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కళ్లే చంద్రశేఖర్‌శర్మ, హెచ్‌కే రాజశేఖర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు.

వైకుంఠ క్షేత్రంలో ఎక్స్‌కవేటర్ ఏర్పాటు


శ్మశాన వాటికలో ఎక్స్‌కవేటర్‌తో సద్గురు దత్త కృపాలయం గౌరవాధ్యక్షురాలు, తదితరులు

కర్నూలు(కల్చరల్), మార్చి 22: సద్గురుదత్త కృపాలయం సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోగల వైకుంఠ క్షేత్రం (శ్మశాన వాటిక)లో పార్థీవ దేహాల పూడ్చివేతకు ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేశారు. సద్గురదత్త కృపాలయం సంస్థ గౌరవాధ్యక్షురాలు కె. క్రిష్ణకుమారి మాత చేతుల మీదుగా ఎక్స్‌కవేటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు జి.మల్లారెడ్డి మాట్లాడుతూ నగరంలోని ప్రభుత్వ వైద్యశాలలో గత కొన్ని సంవత్సరాలుగా రోగుల బంధువులకు నిత్యాన్నదాన సేవలు నిర్వహిస్తున్నామని, అలాగే మరణించిన వారి పార్థివ దేహాలను వైకుంఠ క్షేత్రాలకు తరలించేందుకు ఉచిత వైకుంఠ రథాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు డి.రాకేశ్, జి.నిర్మలారెడ్డి, కార్యదర్శి పి.శ్రీధర్ గుప్త పాల్గొన్నారు.



భగత్‌సింగ్ వర్ధంతి సభను జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 22: భగత్‌సింగ్ 93వ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శనివారం భగత్‌సింగ్ వర్ధంతిని వీధి వీధినా నిర్వహించాలన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి 1931 మార్చి 23న ఉరితీయబడ్డారని అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతులను జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించాలని అన్నారు. అదే రోజు సాయంత్రం జిల్లా పరిషత్ గాంధీ విగ్రహం వద్ద జరిగే కొవ్వొత్తుల నివాళిలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ అధ్యక్షు డు రాఘవేంద్ర, నాయకులు గోవర్ధన్, ఎస్ఎ ఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, నగర అధ్యక్షుడు అమర్, యోగి పాల్గొన్నారు.

ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలి

కోడుమూరు(రూరల్), మార్చి 22: రానున్న ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ విజయశేఖర్ అన్నారు. శుక్రవారం రాత్రి గోరంట్ల, లద్దగిరి, అనుగొండ, అమడగుంట్ల గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రాబోవు ఎన్నికల దృష్ట్యా ప్రజలకు భరోసా కల్పించేందుకు కవాతు చేపట్టామని, ఓటర్లు తమ హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని చెప్పారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేసినా పోలీసులకు లేదా 100కు డయల్ చేసి చెప్పాలన్నారు. సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ బాలనరసింహులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ధార్మిక పర్యటనకు వెళ్లిన పీఠాధిపతి

మంత్రాలయం, మార్చి 22: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ధార్మిక పర్యటనలో భాగంగా కర్ణాటకలోని హోసరుత్తికి వెళ్లినట్లు మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం తన శిష్యబృందంతో ధార్మిక పర్యటనకు వెళ్లి హోసరుత్తిలో వెలసిన జీవేంద్రతీర్థుల ఆరాధనలో పాల్గొని పూజలు చేసి ఈ నెల 26న మంత్రాలయం వస్తారని తెలిపారు. పీఠాధిపతి అందుబాటులో లేన విషయాన్ని భక్తులు గమనించాలని కోరారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

మంత్రాలయం, మార్చి 22: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేటట్లు గ్రామస్తులంతా సహకరించాలని మాధవరం ఎస్ఐ క్రిష్ణమూర్తి అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామస్తులకు, ఎన్నికలపై, చట్టాలపై ఎస్ఐ గ్రామస్థులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, అక్షరాస్యత, భూవివాదాలు వంటి అంశాలపై చర్చించారు.

వెంకటస్వామి ఆశయాలను కొనసాగిద్దాం

ఎమ్మిగనూరు, మార్చి 22: యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి దివంగత అప్పారి వెంకటస్వామి ఆశయాలకు పునరంకితమవుదామని యుటీఎఫ్ రాష్ట్ర సహాఅధ్యక్షుడు సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం అప్పారి వెంకటస్వామి 24వ వర్ధంతిని స్థానిక వీవర్స్ కాలనీలోని ఉన్నత పాఠశాలలో యుటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు దావీదు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, నవీన్ పాటిల్, దేవపాల్, నరసింహులు, కౌలన్న, రాజు, అల్లాబకాష్, ప్రసాద్, పాపయ్య, శివకుమార్, లక్ష్మన్న, విజయ్ కుమార్‌లు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి

మద్దికెర, మార్చి 22: ఒక్క చాన్స్ ఇవ్వండంటూ కపట ప్రేమ చూపించి అధికారంలోకి వచ్చిన జగన్.. మరోసారి అధికారం ఇస్తే.. మన ఆస్తులు కూడా దక్కవని మండల తెలుగు యువత అధ్యక్షులు మూ లింటి రాము యాదవ్, మాజీ ఎంపీటీసీ పులిశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెరవలి గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చాకలి నాగేష్ ఉన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

తుగ్గలి, మార్చి 22: టీడీపీ అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ సీనియర్ నాయకులు మాబాషా, వైస్ సర్పంచ్ హుశేన్ అన్నారు. శుక్రవారం చెన్నంపల్లిలో ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే బడుగు, బలహీన వర్గాలతో పాటు గ్రామాలు అభివృద్ధి జరుగుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అక్బర్, రామయ్య, తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆదోని రూరల్, మార్చి 22 : విరూపాపురం గ్రామానికి చెందిన పింజరి కాశీం అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గత నెల 26వ తేదీన ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ వాహనాన్ని కాశీం బైక్ వేగంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న సబ్ కలెక్టర్, డీఎస్పీ శివ నారాయణ స్వామి, రూరల్ సిఐ నీరంజన్‌రెడ్డి, ట్రాఫిక్ సిఐలు మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నామినేషన్ల స్వీకరణ

ఆదోని రూరల్, మార్చి 22 : ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నికల సందర్భంగా నామినేషన్లు ప్రారంభం అయ్యాయి. ప్రస్తుత కమిటి పదవి కాలం పూర్తి కావడంతో నూతన కమిటీ కోసం బార్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేయడంతో శుక్రవారం అధ్యక్షుల పోటీ కోసం సుందర్ సింగ్, అనీత బాయి, ఉపాధ్యక్షుల కోసం జనార్ధన్, ప్రధాన కార్యదర్శి సురేంద్ర కుమార్, కార్యదర్శిగా మల్లికార్జున, కోశాధికారిగా కెఎండి లతీఫ్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 27న బార్ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి న్యాయవాది శ్రీరాములు, మల్లికార్జున, రామలింగలు తెలిపారు.

సింహ వాహనంపై శ్రీరంగనాథస్వామి



సింహవాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

మద్దికెర, మార్చి 22: మండలంలోని పెరవలి గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రంగనాథుడు సింహవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం మూలవిరాట్ రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అర్చకులు పంపిణీ చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులై శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవమూర్తులను పల్లకిలో అధిష్ఠించి ఊరేగింపు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి సింహవాహనంపై అదిష్ఠించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ పూజా కార్యక్రమంలో దాతలు కుమ్మరి రంగన్న, ఎర్రన్న, కుమారుడు రాష్ట్ర బీసీ సంఘం నాయకులు కుమ్మరి రామచంద్ర, రాధిక, దేవీష్, రంగస్వామి, చంద్రమౌళీశ్వరరెడ్డి, నీరజ వారి కుటుంబ సభ్యులతో పాటు దేవాలయ చైర్మన్ ఈడిగ దస్తగిరిగౌడు, ఈవో చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రం మార్పు

మద్దికెర, మార్చి 22: మద్దికెర గ్రామంలో ఎస్సీ కాలనీలో గల ఆది ఆంధ్ర పాఠశాలలోని 37వ పోలింగ్ బూత్‌ను స్థానిక డీపీఏపీ పాఠశాలకు మార్పు చేసినట్లు తహసీల్దార్ రజాక్‌వలి తెలిపారు. శుక్రవారం మార్పు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ కాలనీలోని ఆది ఆంధ్ర పాఠశాలలో 35, 36, 37 పోలింగ్ కేంద్రాలు ఒకే చోట ఉండటం వల్ల ఓటర్లు ఇబ్బందులు పడేవారన్నారు. ఓటర్ల అభ్యర్థన మేరకు మార్పు చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్ ఉన్నారు.

'టీడీపీతోనే బీసీల అభివృద్ధి'

గోనెగండ్ల, మార్చి 22: బీసీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థానాలకు ఎదగాలంటే టీడీపీతోనే సాధ్యమని జిల్లా తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర యువజన కురువ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ అన్నారు. కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా కురువ సామాజిక వర్గానికి చెందిన పంచలింగాల నాగరాజును టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అభ్యర్థి నాగరాజుకు మిఠాయిలు తినిపించి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో దరగలమాబు, కౌలుట్లయ్యనాయుడు, గాజులదిన్నె శ్రీనివాసుల నాయుడు, చెన్నల రాయుడు పాల్గొన్నారు.

ఆలూరు: కర్నూలు టీడీపీ ఎంపీగా పంచలింగాల నాగరాజుకు టీడీపీ అధిష్ఠానం టికెట్ ఖరారు చేయడంతో శుక్రవారం ఆలూరులో టీడీపీ, కురువ సంఘం నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక అంబేడ్కర్, వాల్మీకీ విగ్రహాలకు పూల మాలలు వేశారు. అనంతరం మాజీ ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్‌లు కురువ జయరామ్, రామ్‌నాథ్ యాదవ్, ఆలూరు రైతు సంఘం తాలూకా అధ్యక్షులు దేవేంద్ర మాట్లాడుతూ బీసీ వర్గాలకు తెలుగుదేశం పార్టీలోనే ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. అదే క్రమంలో కురువ సామాజిక వర్గాన్ని గుర్తించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పంచలింగాల నాగరాజుకు టీడీపీ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో టీడీపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణ, సరసప్ప, సురేంద్ర, డా. నెట్టప్ప, వెంకన్న, ముద్దరంగా, అశోక్, రంగయ్య, సుధాకర్, లక్ష్మన్న, వెంకటేష్, గుళ్యం రామాంజినేయులు, ఆంజనేయ, లక్ష్మీపతి, విష్ణు, రాము, కురువ సంఘం నాయకులు మల్లి, రవి, రమేష్, హనుమప్ప పాల్గొన్నారు.

పత్తికొండ: బస్తిపాటి నాగరాజుకు ఎంపీ టికెట్ కేటాయించడం హర్షిస్తూ పత్తికొండలో టీడీపీ నాయకులు, కురువ సంఘం నాయకులు బాణాసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కట్టుబడి పని చేసే ఏకైక పార్టీ టీడీపీనేనని కురువ సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు హోటల్ శ్రీనివాసులు అన్నారు.

వెల్దుర్తి: తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన మూడవ జాబితాలో కర్నూలు పార్లమెంటు అభ్యర్థిగా బస్తిపాటి నాగరాజు(పంచలింగాల నాగరాజు)ను ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయమని మండల టీడీపీ అధ్యక్షులు బలరాంగౌడ్ అన్నారు. శుక్రవారం ఎంపీ అభ్యర్థి నాగరాజు స్వగ్రామమైన పంచలింగాలలో ఆయనను మర్యాదపూర్వకంగా కలసి పూలమాలలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వెల్దుర్తి పాతబస్టాండ్‌లో మాదాసి కురవ సంఘం మండలాధ్యక్షుడు శివ, శ్రీనివాసులు ఆధ్వర్యంలో టపాసులు, బాణసంచా పేల్చి హర్షం వ్యక్తం చేశారు. ఆయనను కలిసిన వారిలో ఈదుల వెంకటరాముడు, మంగంపల్లె శ్రీను, అల్లుగుండు శివ తదితర నాయకులు పాల్గొన్నారు.



నాగరాజును సన్మానిస్తున్న వెల్దుర్తి నాయకులు

ఆస్పరి: టీడీపీ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థిగా బీసీ వర్గానికి చెందిన పంచలింగాల నాగరాజును పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఎంపిక చేయడం పట్ల శుక్రవారం ఆస్పరి మండల టీడీపీ నాయకులు, సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణయాదవ్, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ బైలు పత్తికొండ గోవిందు, యూత్ నాయకులు సతీష్ కుమార్, మహేష్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నరేంద్ర, శ్రీకాంత్, బీరయ్య, మద్దిలేటి, చంటి పాల్గొన్నారు.

వైసీపీ పాలనను అంతమొందిస్తాం



మాట్లాడుతున్న నీలకంఠ

ఆలూరు, మార్చి 22 : టీడీపీ, బీజేపీ, జనసేన కూటమితో వైసీపీ పాలనను అంతమొందిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అన్నారు. ఆలూరు పట్టణంలో శుక్రవారం బీజేపీ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ సాగించిన అవినీతి, దౌర్జన్య పాలనతో ప్రజలు విసుగు చెందారన్నారు. అనంతరం ఆలూరు నియోజకవర్గం పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయిస్తే ఎవరు పోటీ చేస్తారనే విషయంపై చర్చించారు. సీనియర్ నేతల అభిప్రాయాలను సేకరించారు. అవకాశం వస్తే తాను పోటీచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆలూరు అసెంబ్లీ కో కన్వీనర్ తెలుగు అంబన్న ముందుకొచ్చారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు ఖాసీం బీ, జిల్లా ప్రధాన కార్యదర్శులు కోటేశ్వర యాదవ్, ఉపేంద్ర, తాలూకా అధ్యక్షులు వెంకటరాముడు, సీనియర్ నాయకులు రవీంద్రరావు, చిదానంద, మండల కన్వీనర్లు, ప్రసాద్, పరంధామయ్య, రవి, నరసప్ప, గాదిలింగ, బసవరాజు పాల్గొన్నారు.

రేణుకాచార్యుల జయంత్యుత్సవం



ధర్మసభలో ప్రసంగిస్తున్న మహాస్వాములు

ఆదోని టౌన్, మార్చి 22 : ఆది జగద్గురు రేణుకాచార్యుల జయంతి ఉత్సవాన్ని శుక్రవారం స్థానిక పేట వీరభద్ర స్వామి దేవస్థానంలో ఆదోని డివిజన్ జంగమ సమాజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం పేట వీరభద్రేశ్వర స్వామి, రేణుకాచార్యుల మూర్తులకు రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. అనంతరం జంగమ చిన్నారులు మహాస్వాముల సమక్షంలో అయ్యాచార దీక్షను చేపట్టి కార్యక్రమం నిర్వహించారు. వీరశైవ కళ్యాణ మండపంలో జరిగిన ధర్మసభలో కల్లుహోలే మఠం (పాల్తూరు)కు చెందిన చెన్న వీరశివాచార్య మహాస్వామి, పురవర్గ మఠం (జంగమర హోసల్లి)కు చెందిన అజాత శంభులింగ శివాచార్య మహాస్వామి, వీరేమఠం(రౌడీగుంది)కు చెందిన శివయోగి శివాచార్య మహాస్వామి ,కల్లుమఠం (ఆదోని)కు చెందిన గురుసిద్ధ మహా స్వాములు ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ జంగమ సమాజ సేవా సంఘం అధ్యక్షుడు ఎం. పురుషోత్తం, కార్యదర్శి మహర్షి విజయ్ కుమార్ స్వామి, కోశాధికారి బెల్లం వీరేష్, రామలింగయ్య స్వామి, వీరశైవ సేవా సమాజ సంఘం, విద్యావర్థక సంఘం, యువక సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో ఉత్సవ కార్యక్రమాలు ఎంతో ఘనంగా నిర్వహించారు.

రూ.1.54 కోట్ల వడ్డీ మాఫీ

ఆదోని టౌన్, మార్చి 22 : పట్టణ పరిధిలో ఆస్తి పన్ను బకాయిలను ఏకకాలంలో చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తామన్న అధికారుల ప్రకటన సత్ఫలితాన్ని ఇచ్చింది. స్థానిక జీఎస్ ప్రొడక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ వారు 2000వ సంవత్సరం నుంచి మునిసిపాలిటీకి ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంది. బకాయి రూ.64.57 లక్షలు కాగా, వడ్డీ రూ.1.54 కోట్లు కలిపి మొత్తం రూ.2.18 కోట్లకు చేరింది. ఈ నెల 31వ తేదీ వరకు వడ్డీ మాఫీ అవకాశం ఉండటంతో రెవెన్యూ శుక్రవారం సదరు పారిశ్రామికవేత్త ఒకేసారి బకాయి చెల్లించి రూ.1.54 కోట్ల భారీ వడ్డీ మాఫీ పొందారు.

బీసీ బాలికల హాస్టల్ మూసివేత తగదు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 22 : ఆదోని పట్టణంలో బీసీ బాలికల హాస్టల్‌ను మూసివేయడం తగదని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధనాపురం ఉదయ్ అన్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు సర్కిల్లో హాస్టల్ మూసివేతను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా పరీక్షల సమయంలో హాస్టల్‌ను మూసివేసి, బాలికలకు విద్యను దూరం చేస్తున్నారని అన్నారు. వెంటనే హాస్టల్ తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకుల వంశీ, రఘు, విక్రమ్, సునీల్ పాల్గొన్నారు.

● వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

ఉన్నతాధికారుల అనుమతి, ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా బీసీ బాలికల కళాశాల హాస్టల్‌ను మూసివేసిన వార్డెన్ ప్రమీళను వెంటనే సస్పెండ్ చేయాలని ఆర్‌పీఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజ డిమాండ్ చేశారు.

ఎల్లార్తి దర్గాను దర్శించుకున్న కోట్ల



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

హొళగుంద, మార్చి 22 : హొళగుంద మండలంలోని ఎల్లార్తి షేక్షావలి, షాషావలి సాహెబ్ దర్గాలను కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రజలు జగన్‌ను నమ్మే పరిస్థితిల్లో లేరని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లో తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకులపై ఉందని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి పీబీ లత, టీడీపీ రాష్ట్ర వ్యవసాయ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, కోడుమూరు మాజీ సర్పంచ్ కేఈ రాంబాబు, రామ్మోహన్ గౌడ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆంధ్రయ్య, టీడీపీ సీనియర్ నాయకులు హేమాద్రి రెడ్డి, వీరేష్, నరేంద్ర, సోమేష్, రెహమాన్, ఎల్లార్తి ఎంపీటీసీ బసప్ప, చిదానంద, వసీం పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశాం

మంత్రాలయం, మార్చి 22: ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని మంత్రాలయం ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీధర్‌మూర్తిలు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలో 237 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 6 మంది ఉండేటట్లు సిద్ధం చేశామని, ఇప్పటికే ఎన్నికల విధుల్లో బీఎల్వోలు నిమగ్నమయ్యారని అన్నారు. 30 రూట్స్, 24 సెక్టార్ అధికారులను సిద్ధం చేశామన్నారు. సమావేశంలో డీటీ రాఘవేంద్ర, శశిశేఖర్‌రావు, ఆర్ఐ ఆదాం, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

గోనెగండ్ల, మార్చి 22: ప్రజలు వచ్చే ఎన్నికల్లో ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, గోనెగండ్ల సీఐ రామకృష్ణయ్య కోరారు. శుక్రవారం మండల పరిధిలోని కున్నూరు, హెచ్ కైరవాడి గ్రామాలలో సెంట్రల్ ఫోర్స్, ఎస్ఎస్‌బీ, గోనెగండ్ల పోలీసుల ఆధ్వర్యంలో గ్రామంలోని పురవీధుల గుండా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌బీ అసిస్టెంట్ కమాండర్ రాకేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రమణీయం రజిత రథోత్సవం



మంత్రాలయం, మార్చి 22: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజిత రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం ద్వాదశి వేడుకలను పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజిత రథాన్ని వివిధ పుష్పాలతో చూడ ముచ్చటగా అలంకరించి ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కేజ్రీవాల్ అరెస్టు సమంజసం కాదు

ఆదోని టౌన్, మార్చి 22: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు సమంజసం కాదని ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నూర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి భయ భ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. ప్రతిపక్షాలను ఎదుర్కోలేక, మోదీ ప్రభుత్వం బలమైన ప్రతిపక్ష నాయకులు ఒక్కొక్కరిని వివిధ కేసులలో ఇరికిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలలో సరైన పోటీ లేకపోతే ప్రజాస్వామ్యానికి విలువ లేదని, ప్రధాని మోదీ తన నియంతృత్వ ధోరణితో ప్రతిపక్షాలను ఆందోళనకు గురి చేయడం తగదన్నారు. వెంటనే ఆయనను భేషరతుగా జెయిల్‌పై విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



మాజీ ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరుతున్న సోగనూరు వైసీపీ నాయకులు

ఎమ్మిగనూరు, మార్చి 22: మండల పరిధిలోని సోగనూరు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే ఇంటి దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సోగనూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు హనుమంతు, మారయ్య, రాజు, పప్పు రాముడు, రాముడు, రంగన్న, బషీర్, వెంకటేష్, నరసప్ప, చాకలి నరసింహులు, చాకలి వీరేష్, రామలింగడులతో పాటు మరో వంద మంది టీడీపీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బీవీ టీడీ పీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా బీవీ మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో వైసీపీ అన్ని రకాల ధరలు పెంచి పేదల నడ్డి విరిచిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. సాగు, తాగునీరు గ్రామాలకు అందాలంటే టీడీపీ రావాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు పార్లపల్లి మల్లికార్జున, సర్వేశ్వర్లు,రాఘవేంద్ర, శంకర్ గౌడ్, రఘు, హనుమంతు, జగదీష్‌లు పాల్గొన్నారు.

బీవీ సుడిగాలి పర్యటన

నందవరం, మార్చి 22: మండలంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. పలు వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అయనతో పాటు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవ రావు, కాశీంవలి, గురురాజారావు, నాగరాజుగౌడు, మండల పార్టీ కన్వీనర్ డీపీ రాముడు, పెద్దరాముడు, ధర్మాపురం గోపాల్ ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా స్వర్ణలత

మద్దికెర, మార్చి 22: మద్దికెర మేజర్ గ్రామ పంచాయతీ ఇన్‌చార్జిగా ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న స్వర్ణలతను శుక్రవారం నియమించారు. గతంలో కార్యదర్శిగా పని చేస్తున్న శ్రీహరి ఈవోఆర్‌డీగా పదోన్నతి రావడంతో కోవెలకుంట్లకు బదిలీపై వెళ్లారు. దీంతో ఈవోఆర్‌డీ మద్దిలేటిస్వామిని నియమించారు. ఆయన సెలవుపై వెళ్లడంతో ఎం.అగ్రహారం కార్యదర్శి సంజప్పను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన పదోన్నతిపై అన్నమయ్య జిల్లాకు బదిలీ కావడంతో ఎట్టకేలకు స్వర్ణలతను నియమించారు. ఏదేమైనా నెల రోజుల్లో ముగ్గురు అధికారులు మారడం విశేషం.

కర్ణాటక మద్యం పట్టివేత

ఎమ్మిగనూరుటౌన్, మార్చి 22: మంత్రాలయంలోని రామచంద్ర నగర్‌లో, రాఘవేంద్రనగర్‌లో శుక్రవారం అక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యంను ఎమ్మిగనూరు సెబ్ సీఐ భార్గవరెడ్డి ఆధర్యంలో సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. ఈడిగ జయరాముడు, మొండి హనుమంతులు కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడి చేసి 737 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయించిన ఇరువురు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో డీటీఎఫ్ కర్నూలు నర్సానాయుడు, ఎస్ఐ సత్యనారాయణ, పీసీలు వెంకటరాముడు, లింగప్రసాద్, నరసింహారెడ్డి, భరత్‌లు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల ఉల్లంఘన

-విధుల నుంచి వలంటీర్ తొలగింపు

ఆదోని, మార్చి 22: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వలంటీర్‌ను విధుల నుంచి తొలగించామని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ అన్నారు. ఆదోని పట్టణంలో 6వ వార్డు సచివాలయంలో పని చేస్తున్న కే రవికుమార్ తన క్లస్టర్ 11 సంబంధించిన వాట్సాప్ గ్రూపులో శుక్రవారం ఉదయం 9:40 గంటలకు అదే క్లస్టర్ సంబంధించిన వాట్సాప్ గ్రూపులో వైసీపీకి అనుకూలంగా ఎన్డీఏ పార్టీకి వ్యతిరేకంగా వీడియో పోస్ట్ చేశాడని ఫిర్యాదు అందిందని తెలిపారు. విచారణ చేపట్టగా సదరు వలంటీర్ పోస్ట్ చేయడం నిజమేనని నిర్ధారణ అవ్వడంతో తక్షణమే విధుల నుంచి తొలగించడమైనదని తెలిపారు.

ప్రలోభాలకు గురికావద్దు

పత్తికొండ, మార్చి 21: ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని పత్తికొండ ఎన్నికల నిర్వహణాధికారి రామలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ భవనంలో పొదుపు సంఘాల మహిళలకు ఓటు హక్కు విలువ, ఓటు వేసే విధానం అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్డీవోతోపాటు తహసీల్దార్ మాదవరాజు, రామారావు, వెలుగు మధుగౌడ్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనపై ర్యాలీ

ఆదోని టౌన్, మార్చి 22 : ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం గురించి ప్రచారం చేస్తూ క్షయ వ్యాధి నిర్మూలనపై టీబీ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మండిగిరి పురపాలక పాఠశాల నుంచి వ్యాధిపై అవగాహన కల్పిస్తూ, క్షయవ్యాధి రహిత దేశం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

వైసీపీ నాయకుల భూ దందాలపై చర్యలు తీసుకోవాలి

క్రిష్ణగిరి, మార్చి 22: అధికారుల అండదండలతో వైసీపీ నాయకులు యధేచ్ఛగా భూ దందాలకు పాల్పడుతున్నారని విచారణ జరిపి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల టీడీపీ ఉపాధ్యక్షుడు రామకృష్ణాపురం దామోదర్ నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం క్రిష్ణగిరిలో ఆయన మాట్లాడుతు ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు గ్రామ వైసీపీ నాయకులు,ఫీల్డ్ అసిస్టెంట్ సుభాష్ (కాటుమాని సురేంద్ర కుమార్‌కు సర్వే నెం:169లో ఎకరం పది గుంటల పొలం ఉన్నది. అయితే రెవెన్యూ అధికారుల అండదండలతో సర్వే నెం:169ను సబ్ డివిజన్ చేసి 169-1లో 8ఎకరల భూమిని సృష్టించి, ఈ భూమిని సబ్ రిజిస్ట్రేషన్ అధికారుల అండదండలతో ఫిబ్రవరిలో హైదరాబాద్‌కు చెందిన ఓక్‌లాండ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ వారికి ఎకరం ఐదు లక్షల చొప్పున నలభై లక్షలకు విక్రయించారన్నారు. అంతేకాకుండా అదే గ్రామానికి చెందిన కొద్ది మంది రైతుల పొలాన్ని సబ్ డివిజన్ చేసి తమ పేర్లపై రెవెన్యూ అడంగల్‌లో రికార్డు చేయించుకున్నారని, ఇప్పుడు భూమి తమ పేర్లపైన ఉన్నదని అసలు యజమానులను పొలంలోకి వెళ్ళనివ్వడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేయాలి

మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి

మంత్రాలయం, మార్చి 22: మంత్రాలయం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పెద్దకడుబూరు మండలంలోని నెమలికల్లు, ముచ్చుగేరి, చిన్నకడుబూరు, కోసిగి మండలంలోని కామన్‌దొడ్డి గ్రామాల నాయకులు, కార్యకర్తలతో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రెండో విడతలో మంత్రాలయం టికెట్ కేటాయించిన పరిస్థితులపై టీడీపీ అధిష్ఠానం పునరాలోచన చేస్తోందని, త్వరలో త్వరలో కార్యకర్తలు, నాయకులు కోరుకున్న వారికే టికెట్ ప్రకటిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్రిష్ణమోహన్ రెడ్డి, విజయ రామిరెడ్డి, దశరథరాముడు, నరసింహులు, మంత్రాలయం ఎంపీటీసీ మేకల నరసింహులు, దస్తగిరి, నరసప్ప, ఈరన్న, వీరేష్, దొడ్డయ్య, సోల్మాన్‌రాజు, చిదానంద తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం, మార్చి 22: ప్రజా ఆశీస్సులు, కార్యకర్తల అండ ఉన్నంత వరకు తాను ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తప్పక పోటీ చేస్తానని ప్యాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. మండలంలోని ఉరుకుంద గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముందుగా గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో స్వామి వారిని మండల టీడీపీ నాయకులతో కలసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. టీడీపీ అధిష్ఠానం పునఃపరిశీలించి తనక అసెంబ్లీ సీటు తప్పక కేటాయిస్తుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్, డైరెక్టర్ శివమోహన్‌రెడ్డి, కోట్రేష్‌గౌడ్ టీడీపీ రైతు విభాగపు రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు అడివప్ప గౌడ్, వెంకటపతిరాజు, నాయకులు కురుగోడు, బాపురం వెంకటరెడ్డి, కోసిగి నాయకులు నాడిగేని అయ్యన్న, వీరారెడ్డి, బొంపల్లి నరసింహులు, వక్రాణి వెంకటేష్, ఐటీడీపీ నాయకులు మంజునాథ, ఉసేని, కార్యకర్తలు సిద్దు, రాజబాబు ఉన్నారు.



ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న తిక్కారెడ్డి